క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన డాక్టర్ నాగేశ్వరమ్మ దంపతులు ఆదివారం రూ.51 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్ము ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మృతుడికి నివాళి



నివాళులర్పిస్తున్న వాసుదేవనాయుడు

తొట్టంబేడు: చోడవరం గ్రామానికి చెందిన రోమల విజయభాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉన్నం వాసుదేవనాయుడు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగోలు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మహిళలతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: బంగారం ధర పెరుగుతుండడంతో ఆభరణాలు ధరించి బయటకు వచ్చినప్పుడు మహిళలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన బుచ్చినాయుడుకండ్రిగలో మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించి ఆటోవాలాలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వాహనాలను మెయిన్‌రోడ్డులో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వాహనదారులకు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ప్రార్థనలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: దేశాభివృద్ధే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ ఉపాధ్యాయ విభాగ్ ప్రముఖ్ బూడిదేటి జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నీర్పాకోట గ్రామంలో ఆంజనేయ దేవాలయ ఆవరణలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తికావడంతో పలు కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఖండ కార్యవాహ గురుస్వామి, ఖండ ధర్మ ప్రచారక్ హనుమంతురెడ్డి, మార్కొండేయులు, రమణయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం



నియామక పత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆద్విక ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. యువత పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎంపికైన వారికి బృందమ్మ నియామక పత్రాలను అందజేశారు. ఉపాధి కల్పనకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు.

పిడియాట్రిక్స్ న్యూరాలజీపై వర్క్‌షాపు

తిరుపతి తుడా: చిన్న పిల్లల ఆరోగ్యం మెరుగు పరచడంపై రుయా న్యూర్యాలజీ విభాగం, బలరాం ఛైల్డ్ న్యూరో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పిడియాట్రిక్స్ న్యూరాలజీపై రెండు రోజుల వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. చిన్నపిల్లల్లో నరాల బలహీనత, వారికి ఆరోగ్య పరంగా కలుగుతున్న ఇబ్బందులపై చర్చించి మెరుగైన వైద్యం అందించడంపై ప్రధానంగా వర్క్‌షాపులో చర్చించినట్టు చిన్నపిల్లల వైద్య నిపుణులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జే.రాధ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలే!

చిత్రంలో శవాన్ని తరలిస్తున్న దృశ్యం పెద్ద పాండూరులోని ముస్లింలు. వీరికి గ్రామ సమీపంలో శ్మశాన వాటిక ఉంది. 40ఏళ్లుగా ఆ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేసేవారు. అయితే శ్మశాన వాటికకు వెళ్లేందుకు గతంలో పొలాల నడుమ చిన్నపాటి దారి ఉండేది. నేడు ఆ బాటను సమీప రైతులు ఆక్రమించుకోడంతో దారి లేక పంట పొలాల నడుమ శవాన్ని తీసుకువెళ్లాల్సిన పరిస్థితుల్లో అవస్థ పడుతున్నారు.



పెద్ద పాండూరులో ముస్లింల శ్మశాన వాటికకు దారి లేక పొలాల మధ్య శవాన్ని తరలిస్తున్న ముస్లింలు



సురుటుపల్లిలో వాగు నీటిలో మృతదేహాన్ని మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

నాగలాపురం మండలం సురుటుపల్లిలో మనిషి చనిపోతే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు బాధలు వర్ణనాతీతం. గ్రామ సమీపంలో ఉన్న వాగును దాటి అవతలికి శవాన్ని తరలించాల్సిన పరిస్థితి. వీరి శ్మశాన దారి ఇబ్బందుల గురించి అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

- శవాన్ని తరలించాలంటే వాగులు, పొలాలను దాటాల్సిందే!
- శ్మశాన వాటికలకు దారి లేక ఇబ్బందులు
- వర్షాకాలమొస్తే ఇబ్బందులు వర్ణనాతీతం

వరదయ్యపాళెం: స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు దాటుతున్నా నేటికీ ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నామన్న ప్రభుత్వాల గొప్పలకు కనీసం శ్మశాన వాటికలకు దారి లేదన్న సమస్యలు కనిపించడం లేదు. ప్రధానంగా వర్షాకాలంలో సాటి మనిషి చనిపోతే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించాలంటే వాగులు, వంకలు, పంట పొలాలు దాటాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో శ్మశాన వాటికకు శవపేటికను తరలించాలంటే ఆ నలుగురి కష్టం వర్ణనాతీతం. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో శ్మశాన వాటికలకు నేటికీ దారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో శ్మశానానికి దారి లేని గ్రామాలు

- బీఎన్‌కండ్రిగ మండలంలోని కనవనంబేడు, కాటూరు, కొత్తపాళెం, కంచనపుత్తూరు, పీవీకండ్రిగ, ఆలత్తూరు, పుత్తేరి, కుక్కంబాకం, కాంపాళెం, బీఎస్‌పురం, నెలవాయి గ్రామాల్లో శ్మశాన వాటికలకు నేటికీ దారి లేని పరిస్థితి.
- కేవీబీపురం మండలంలోని కళత్తూరు, మహాదేవపురం
- సత్యవేడు మండలంలోని నరసరాజు అగ్రహారం, కొల్లడం
- నారాయణవనం మండలంలోని తీరువట్యం దళితవాడ
- పిచ్చాటూరు మండలంలోని అడవికొడియంబేడు
- వరదయ్యపాళెం మండలంలోని సాతంబేడు, రాచర్ల అరుంధతివాడ, కోవూరుపాడు, చెన్నవారిపాళెం, ఆకిసింపాళెం, కారిపాకం గ్రామాల్లో అదే పరిస్థితి. అలాగే పెద్ద పాండూరు గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికకు గతంలో ఉన్న దారిని స్థానిక రైతులు ఆక్రమించుకోగా నేడు పంట పొలాల్లో వెళ్లాల్సిన పరిస్థితి.

కూటమి ప్రభుత్వం స్పందించేనా?

ఓవైపు రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతామని ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం శ్మశాన వాటికలకు వెళ్లే రోడ్ల గురించి దృష్టి పెట్టాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో మనిషి చనిపోతే శవాన్ని తరలించేందుకు పడుతున్న కష్టాలైనా చూసి ప్రభుత్వం స్పందించాల్సిన బాధ్యత ఉందన్నారు.



సాతంబేడులో పంట పొలాల్లో శవాన్ని మోసుకెళ్తున్న బంధువులు

దారి ఏర్పాటు చేయండి



మా గ్రామానికి శ్మశాన వాటిక పంట పొలాల మధ్యలో ఉంది. గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లాలంటే అర్ధ కి.మీ దూరం పంట పొలాల నడుమ వెళ్లాలి. వర్షాకాలంలో ఓవైపు సాగు చేసిన వరి పంట, మరోవైపు వర్షపునీటితో నిండిన పొలాల్లో అడుగు తీసి అడుగు వేయలేక శవాన్ని మోసుకెళ్లలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులతో మాట్లాడి రోడ్డు సౌకర్యం కల్పించండి.

–రాంబాబు, కోవూరుపాడు

ఆక్రమించేశారు...



పెద్ద పాండూరులో ముత్తరాశిపాళెంకు సమీపంలో ముస్లిం శ్మశాన వాటిక ఉంది. 40ఏళ్లుగా అక్కడే ముస్లింలకు సంబంధించి ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేసుకుంటున్నాం. అయితే శ్మశాన వాటికకు వెళ్లే దారి కొద్దిరోజుల క్రితం ఆక్రమించారు. దీంతో దారి సౌకర్యం లేక శ్మశాన వాటికకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సర్వే చేసి దారి సౌకర్యం కల్పించాలి.

–నాగూర్ బాషా, పెద్ద పాండూరు

ప్రభుత్వం నుంచి స్పందన లేదు



మా గ్రామంలో శ్మశాన వాటికకు దారి లేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలో మా గ్రామంలో మనిషి చనిపోతే ఉన్న వాళ్లకు చావొచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. వాగు దాటి అవతలికి తరలించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. ఈ సమస్య గురించి పదుల సంఖ్యలో అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదు.

–సుబ్రమణ్యం, సురుటుపల్లి, నాగలాపురం మండలం

రాస్‌లో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్



పిల్లలతో ప్రేరణ ప్రతినిధులు

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలో ఉన్న రాస్ బ్రాంచ్‌లో ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మెంటల్లీ చాలెంజ్ పిల్లలతో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు అవసరమైన ప్లే అండ్ లెర్న్ మెటీరియల్‌ను అందించారు. సొసైటీ ప్రతినిధులు పిల్లలు కలిసి ఆనందంగా ఆటలు ఆడారు. ఈ సందర్భంగా ప్రేరణ హెల్పింగ్ సొసైటీ కోశాధికారి తరుణ్ మాట్లాడుతూ సొసైటీకి రాస్‌లోని పిల్లలతో 13 ఏళ్లుగా బంధాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. పిల్లలకు ప్లే అండ్ లెర్న్ మెటీరియల్ అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.

పట్టణ యువత అధ్యక్షుడికి సన్మానం

శ్రీకాళహస్తి: పట్టణ వైఎస్ఆర్ సీపీ యువత అధ్యక్షుడిగా ఎంపికైన మల్లెంబాకం మునికృష్ణారెడ్డిని ఆదివారం ఏర్పేడు మండల వైఎస్ఆర్ సీపీ, వన్నెకుల క్షత్రియ నాయకులు ఘనంగా సత్కరించారు. మునికృష్ణారెడ్డిని గుర్తించి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పదవి ఇవ్వడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్ లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్‌రెడ్డి, విక్రమ్, మునిశేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, ఉపేంద్ర పాల్గొన్నారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

రేణిగుంట: మండలంలోని కడప రహదారి ఆంజనేయపురం చెక్‌పోస్ట్ సమీపంలో శనివారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీని రేణిగుంట అర్బన్ పోలీసులు కనుగొన్నారు. ఆదివారం అర్బన్ పోలీసులు వివరాలు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం, బొకారో జిల్లా, కారో బస్తి గ్రామానికి చెందిన రామన్ మహతో(48) కరకంబాడిలోని అమరరాజ బ్యాటరీ ఫ్యాక్టరీలో కూలి పనులు చేసేవాడిగా గుర్తించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు వారి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతకాల ఉద్యమంలో భాగస్వాములు కండి





కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్, సంతకాల సేకరణ పత్రాలను ప్రజల నుంచి అందుకుంటున్న రాజేష్

- సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వరదయ్యపాళెంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మాణం చేపడితే, ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ పేరుతో వాటిని పేదలకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. పార్టీ శ్రేణులందరూ ఈ విషయాన్ని గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి ప్రజలను చైతన్యపరిచి రచ్చబండ కార్యక్రమాల ద్వారా నవంబర్ 22 వరకు సంతకాల సేకరణ చేపట్టి కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బందిల సురేష్, మహేంద్ర, శివా యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, సీనియర్ నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాని రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి శోభన్ యాదవ్, జిల్లా మహిళా కార్యదర్శి కవిత, మండల బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ యాదవ్, ప్రతాప్ పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

- సమన్వయకర్త నూకతోటి రాజేష్



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్సు ఉన్న మద్యం దుకాణాల నుంచి కూటమి ప్రభుత్వమే కల్తీ మద్యం అమ్ముతూ పేద ప్రజల ప్రాణాలను బలిగొంటున్న వైనాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నాగలాపురం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆదివారం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే నిరసన ర్యాలీ కార్యక్రమం నాగాలపురం ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమం విజయంతానికి నియోజకవర్గంలోని 7 మండలాల పార్టీ అధ్యక్షులు సమన్వయంతో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

రజక సంఘాలతో చైర్‌పర్సన్ భేటీ

తిరుపతి కల్చరల్: రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆదివారం ఓ హోటల్లో రజక సంఘాల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు రజకుల ఆకాంక్ష సభలు రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాల్లో నిర్వహించి రజక సమస్యలపై చర్చి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, త్వరలో మూడో సభ ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలనే డిమాండ్‌ను ఇప్పటి వరకు జరిగిన సభల్లో మంత్రులు, ఎమ్మెల్యే మద్దతు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ సతీష్ (అమలాపురం జిల్లా), సుకుమాంబ, చిత్తూరు ఉమ్మడి జిల్లా డైరెక్టర్లు అన్నాసముద్రం మదనమోహన్, కరాటే చంద్ర, ఏపీరాష్ట్ర రజక జన సేన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, మల్లెల నాగరాజు, గంధం బాబు, చెంబుకూరి రాజయ్య, చాకలి శంకర్, బాలాజీ వెంకటేష్, మణి, సుధాకర్, శివ, ఈశ్వర్, దేవానంద్ పాల్గొన్నారు.

వైభవంగా శివ మహోత్సవం



ఆలయం వద్ద సహపంక్తి భోజనం

నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో ఆదివారం ప్రపంచ శివసేవకుల అసోసియేషన్ గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం శివమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తమిళనాడు శైవ సేవకుల కోఆర్డినేటర్ ఈశ్వరన్ స్వామి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్ర శైవసేవక అసోసియేషన్ కార్యదర్శి జంబులింగం స్వామి భక్తులకు పంచపురాణం, తిరువాసగంపై ఉపదేశం చేశారు. అనంతరం అసోసియేషన్ గుర్తింపుకార్డులను సేవకులకు అందించారు. భక్తులందరికీ ఆలయం వద్ద సహపంక్తి భోజనం పెట్టారు. నగరి, పుత్తూరు మాణిక్యవాసగర్ శివసేవకుల అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఉపదేశం చేస్తున్న జంబులింగం స్వామి

డాక్టర్ రమణారెడ్డికి పరామర్శ



డాక్టర్ రమణారెడ్డితో మాట్లాడుతున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ప్రముఖ వైద్యుడు డాక్టర్ రమణారెడ్డి తల్లి ఇటీవల మరణించారు. ఆదివారం ఆయనను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీవారి సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, బాల గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: గుంటూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన విజయవాణి ఈ–టెక్నో, ఒలంపియాడ్ స్కూల్ కరస్పాండెంట్ రేణిగుంట చంద్రశేఖర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో చూపిన ప్రతిభ, విద్యారంగ అభివృద్ధికి, సృజనాత్మక బోధన పద్ధతులు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చేసిన కృషికి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఆదివారం పలువురు ఆయనను అభినందించారు.

వృద్ధాశ్రమానికి మెడికల్ కిట్లు వితరణ



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆదివారం అలిపిరి రోడ్డులోని శ్రీపద్మావతి వృద్ధాశ్రమానికి ఉచితంగా మెడికల్ కిట్లు వితరణ చేసింది. బీపీ మానిటర్, డయాబెటీస్ మానిటర్, హాట్ వాటర్ కెటిల్ థర్మామీటర్, ఎపోరస్ ట్రిమ్మర్..మొదలైన వాటిని సంస్థ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఎం.భాస్కర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు రామచంద్రారెడ్డి, బాబురావు, వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ బి.మునీంద్ర నాయక్ పాల్గొన్నారు.

ప్రహ్లాదభక్తి ఆధ్యాత్మిక ప్రవచనాలు



శ్రీనివాస రామానుజదాసును సన్మానిస్తున్న అంజూరు తారకశ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శుకబ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రహ్లాదభక్తి ఆధ్యాత్మిక ప్రవచనాలు చివరి రోజు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉపన్యాసకులు శ్రీనివాస రామానుజదాసు, శుక బ్రహ్మాశ్రమం పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామివారికి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి, పెట్ట జనార్ధన్, మొగరాల గణేష్, ఉదయ్ కుమార్, తేజ, బాల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట జర్నలిస్టుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్



శివమూర్తికి సన్మానం

తిరుపతి కల్చరల్: వే ఫౌండేషన్ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహతి కళాక్షేత్రంలో వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన భారతీయ సంస్కృతి, సాంప్రదాయ నృత్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిస్వార్థంగా సమాజ సేవలు అందిస్తున్న వారిని ప్రతి ఏటా అవార్డులతో సత్కరించడం సంతోషకరమన్నారు. హిందూ విలేకరుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు మునిరామరెడ్డి, జర్నలిస్టు శివమూర్తిని జీవిత సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య పాల్గొన్నారు.

గంగ స్లూయిజ్ కాలువకు మరమ్మతులు



కాలువపై ముళ్లపొదలను తొలగిస్తున్న హిటాచీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట చెరువు నుంచి గంగ నీటి అందించే స్లూయిజ్ కాలువకు మరమ్మతులు చేస్తున్నట్టు డీఈ శ్రీధర్ తెలిపారు. రూ.6లక్షలతో రెండు కిలోమీటర్ల మేర ఉన్న స్లూయిజ్ కాలువకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కాలువపై ఉన్న ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేసి, కాలువకు ఓ వైపున ఉన్న రోడ్డుకు గ్రావెల్ మట్టిని తోలి మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

చంద్రగిరి: శ్రీకోదండరామస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలిసో తెలియకో జరిగే దోషాల నివృత్తికి ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మొదటిరోజు ఆదివారం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్ర నామార్చన, ఉదయం 9 నుండి 11 గంటల వరకు చతుష్టార్చన, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పవిత్ర హోమాలను నిర్వహించారు.